❖•❖•❖ 37 ❖•❖•❖

# యేసు సిలువవేయబడినదెక్కడ?

*"వారు కపాలమనబడిన స్థలమునకు వచ్చినప్పుడు అక్కడ కుడివైపున ఒకనిని ఎడమవైపున ఒకనిని ఆ నేరస్థులను ఆయనతోకూడ సిలువవేసిరి" (లూకా 23:33ఎ).*

క్రైస్తవులు క్రీస్తు మరణమునకు సంబంధించి తరుచుగా అడుగు ప్రశ్న: "ఆయన ఎక్కడ సిలువవేయబడ్డాడు?" అది దాదాపుగా అసలైన చోటును చూచుట – సిలువ పాతిపెట్టబడి యుండిన ఆ స్థలాన్ని తాకగలుగుట మరియు మన రక్షకుడు మరణించిన ఆ పవిత్ర స్థలములో కొన్ని క్షణాలు ధ్యానించగలుగుట – మన హృదయాలకు అవసరమైయున్న ఆదరణను మరియు మనము ఆయనతో నడచుటకు కావలసిన బలమును మనకు ఇస్తుందని మనము అనుకొనుచున్నట్లున్నది.

చారిత్రాత్మక పట్టణాన్ని చూడాలనియు క్రైస్తవ్యము ఆరంభమైన స్థలాలను జాగ్రత్తగా గమనించాలనియు ఒక సందర్శకుడు యెరూషలేమునకు వెళ్లినప్పుడు, అతనికి సర్వ సాధారణంగా యేసు సిలువవేయబడి యుండవచ్చునని తెలియజేయు రెండు స్థలాలు చూపించబడును. ఒకటి, ఒక పెద్ద రాయి మరియు దానిలో ఒక సమాధివలెనే అణగియున్న చోటును చుట్టుకొనియుండు, చర్చ్ ఆఫ్ ది హోలీ సెపల్కర్ చూపించబడును. ఆ పెద్ద రాయి యేసు మరణించిన స్థలమనియు, సమాధివలెనున్న గుహ ఆయన పాతిపెట్టబడిన తోటలోని సమాధియనియు అధికారపూర్వకంగా చెప్పబడుచున్నది. రెండవది, గోర్డన్స్ కేల్వరి, 19వ శతాబ్దములో జాన్ గోర్డన్ చేత కనుగొనబడిన చోటు. దాని క్రింద ఏర్పడిన ఆ పెద్ద రాయి కపాలము యొక్క ఎముకల ఆకృతులను పోలియున్నదని గమనించుచు, అదే కలువరి గిరి యని గుర్తించాడు. దాని సమగ్రాకృతి యేసు సిలువవేయబడిన చోటుకు గల పేరుకు సరిగ్గా సరిపోతుందని ఆయన నమ్మాడు. ఒక్కొక స్థలము యొక్క ప్రామాణికత గూర్చి సవివరంగా చర్చించబడింది; ఏదిఏమైనా, ఈ రెండూగాని రెండింటిలో ఒక్కటిగాని నిజముగా యేసు సిలువవేయబడిన చోటే అయియుంటుందను అంశము ఒక శేష నిర్ణయం గల ప్రశ్నగానే మిగులుతుంది.

"కలువరి గిరి" అని మనము పిలుచుకొను స్థలాన్ని క్రొత్త నిబంధన మూడు లక్షణాలతో వివరించుచున్నది. ఒకొక్క వివరణ నుండి ఒకొక్క గొప్ప (గుణ) పాఠాన్ని నేర్చుకొనవచ్చును.

*అది ఒక సిగ్గుచేటు స్థలంగా, పట్టణ ద్వారమునకు వెలుపల ఉండినది.* "కావున యేసు కూడ తన స్వరక్తముచేత ప్రజలను పరిశుద్ధపరచుటకై గవిని వెలుపట శ్రమపొందెను. కాబట్టి మనమాయన నిందను భరించుచు శిబిరము వెలుపలికి ఆయన యొద్దకు వెళ్లుదము" అని హెబ్రీ పత్రిక రచయిత చెప్పుచున్నాడు (హెబ్రీయులకు 13:12, 13). పాత నిబంధన కాలములో, ఏ పాపపరిహారార్థ బలియైనను ఇశ్రాయేలీయుల శిబిరము లోపల అర్పింపబడలేదు. ఇశ్రాయేలీయుల పాపమును భరించుచుండినదని చెప్పుకొనబడిన గొఱ్ఱె వధింపబడుటకు శిబిరమునకు వెలుపలికి తీసికొనిపోబడింది. ఈ గొఱ్ఱె ఒక చిహ్నమై యుండినది, మన ప్రభువు దాని మూలచిహ్నమై యుండెను. ఆయన, మన నిజమైన

పాపపరిహార్థబలిగా సిలువ మ్రానుపై మేకులతో కొట్టబడుటకు, మన కోసము శాపమై, గవిని వెలుపలికి తీసికొనిపోబడ్డాడు (గలతీయులకు 3:13).

*అది ఒక మార్గమునకు సమీపమున ఉండినది,* గనుక సిలువవేయబడినవారు అపహాసమునకు గురయ్యారు (మత్తయి 27:39). సిలువను దాటుకొంటూ వెళ్లుచుండినవారు యేసు పట్ల పరిహాసముతో కూడిన నిందలు వేస్తారు. "దేవాలయమును పడకొట్టి మూడు దినములలో కట్టువాడా, నిన్ను నీవే రక్షించుకొనుము; నీవు దేవుని కుమారుడవైతే సిలువ మీద నుండి దిగుమని చెప్పుచు" వారు ఆయనను దూషించారు (మత్తయి 27:40). ప్రధాన యాజకులు, ప్రజల పెద్దలు, సైనికులు, మరియు యేసుతో కూడ సిలువవేయబడిన ఇద్దరు దొంగలు సహితము ఇటువంటి ఎత్తిపొడువు మాటలనే పలుకుచు దారిన వెళ్లుచుండినవారితో కలిసిపోయారు. "వీడు ఇతరులను రక్షించెను, తన్నుతానే రక్షించుకొనలేదు; ఇశ్రాయేలు రాజు గదా, యిప్పుడు సిలువమీదనుండి దిగినయెడల వాని నమ్ముదుము. వాడు దేవుని యందు విశ్వాసముంచెను, నేను దేవుని కుమారుడనని చెప్పెను గనుక ఆయనకిష్టమైతే ఆయన ఇప్పుడు వానిని తప్పించుననని" పలికారు (మత్తయి 27:42, 43). యేసు ఈ మాటలన్నిటినీ విన్నాడే గాని మారు మాట్లాడలేదు. ఆయన తన తండ్రి చిత్తమును నెరవేర్చుచుండెనని ఎరిగియుండెను. ఆయన సిలువమీదినుండి దిగిరాడానికి ఏమీ కష్టపడనవసరము లేదు. ఆయన మీదికి విసరబడుచుండిన ప్రతి విమర్శకు సమాధానమిచ్చి ప్రతి ఒక్కరి నోరు మూయించేవాడే, కానీ మనకు రక్షణను సమకూర్చు నిమిత్తము ఆయన సిలువ మీదనే వ్రేలాడుటకు ఎన్నుకొన్నాడు.

వారి పరిహాసము గూర్చి జే. డబ్ల్యు. మెక్‌గార్వే ఇలా వ్రాస్తున్నాడు:

> ఒక విధంగా దేవాలయమును నాశనము చేయు పని వారే చేయుచుండినను, యేసు దేవాలయమును పడగొట్టుట గూర్చి పలికిన మాటలను వారు ఆయనకు గుర్తుచేసారు. ఆయన తిరిగి లేచుటకు మరణించనైయుండిన సమయంలో ఆయన పడగొట్టబడిన దేవాలయమును తిరిగి కట్టుట గూర్చి చెప్పిన విషయాన్ని వారు గుర్తుచేశారు. ఇతరులను రక్షించినప్పటికిని, తనను తాను రక్షించుకొనలేకపోవుట, ప్రభువు ఆ సమయంలో చేయుచుండిన పాపపరిహారార్థబలికి సంబంధించిన గొప్ప సత్యమును గూర్చి వారు ఎగతాళిగా మాట్లాడారు ఆయన సిలువ మీది నుండి దిగి వచ్చినట్లయితే, వారు ఆయనను నమ్ముదురని వాగ్దానం చేశారు, అట్లయినప్పటికిని ఆయన సిలువ మ్రానుమీదికి ఎత్తబడుటయే వారిని ఒప్పించుచుండిన చర్యయై యుండినది [యోహాను 8:28].[1]

అది ఒక తోటకు కూడా సమీపంగా ఉండినది. "ఆయనను సిలువవేసిన స్థలములో ఒక తోట యుండెను; ఆ తోటలో ఎవడును ఎప్పుడును ఉంచబడని క్రొత్త సమాధి యొక్కటి యుండెను" అని యోహాను వ్రాయుచున్నాడు (యోహాను 19:41). మనము సమాధి గుండా సిలువ వైపు చూద్దాము. సిలువ మీద మరణించినవాడు దేవుని కుమారుడై యుండెనని పునరుత్థానము ఘోషించుచున్నది. యేసు మృతులలో నుండి తిరిగి లేచినప్పుడు, ఆయన ఎవరైయుండెనో అను సమస్య ఒక పరిష్కరింపబడినదియు ధ్రువపర్చబడినదియు విషయమయ్యింది. ఎరవైనా గాని యేసు దైవత్వము గూర్చి ఒప్పుకొనకూడదనుకొంటే, ఆయన మృతులలో నుండి తిరిగి లేవలేదని చెప్పుట మాత్రమే ఒక మార్గమై యున్నది. ఏదిఏమైనా, క్రొత్త నిబంధన ఆయన తిరిగి లేచాడను సత్యము గూర్చి ఒక తిరుగులేని సాక్ష్యమిచ్చుచున్నది.

క్రీస్తు దైవత్వము గూర్చి వ్రాయబడియున్న సాక్ష్యమును కాదనగోరువారు క్రొత్త నిబంధన అంతటినీ ప్రక్కనబెట్టాల్సిందే.

యేసు సిలువవేయబడిన ఖచ్చితమైన స్థలమేదో మనకు ఎన్నటికినీ తెలియకపోవచ్చును, కానీ లేఖనాలలో ఇవ్వబడిన వివరముల ద్వారా మనము ఆ స్థలమును గూర్చిన కొన్ని లక్షణాలను తెలిసికొనగలము. ఆయన కుమారుడు మరణించిన ఖచ్చితమైన స్థలమును దేవుడు మనకు చూపించకున్నను, ఆయన వాక్యమిచ్చు హామీ మరియు ఆ వాక్యము యొక్క నిజాయితీని ఆయన మనకిచ్చాడు. అతి పవిత్రముగా నెంచబడు అస్థికలు లేక జ్ఞాపక చిహ్నములకు బదులుగా, ఆయన మనకు దైవీకమైన దస్తావేజులనిచ్చాడు. ఒక పవిత్రమైన స్థలమునకు బదులుగా, ఆయన మనకు లేఖనములనిచ్చాడు. మనము స్పృశించుటకు కోరుకొను ఒక భౌతిక స్థలము కంటె పరిశుద్ధాత్మ సాక్ష్యము ఎంతో గొప్పదియు అర్థవంతమైనదై యున్నది.

ఆయన మన పాపములకు పరిపూర్ణమైన పరిహారార్థబలియై యుండునట్లు యేసు “కపాల స్థలము” అని పిలువబడిన చోట అవమానమును సహించాడు. మనకు నిజమైన రక్షకుడై యుండునట్లు ఆయన దూషణలపాలయ్యాడు. ఆయన మృతులలో నుండి తిరిగి లేచి ఆయన దేవుని కుమారుడై యున్నాడని ధ్రువపర్చునట్లు ఆయన సిలువకు సమీపంలో పాతిపెట్టబడ్డాడు.

❖•❖•❖

*యేసు ఎప్పుడు పుట్టాడన్నది ముఖ్యమైన విషయం కాదు; ఆయన ఎందుకు పుట్టాడన్నది ముఖ్యము. ఆయన ఎక్కడ సిలువవేయబడ్డాడన్నది ముఖ్యము కాదు; ఆయన మరణములో నున్న దైవీక స్వభావము ముఖ్యము. ఆయన చేసిన ప్రాయశ్చిత్త బలియాగములోనే మనము రక్షణ పొందుకొనగల ఒక స్థలమును మనము కనుగొందుము.*

---

సూచన

[1]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or A Harmony of the Four Gospels* (Cincinnati, Ohio: Standard Publishing Co., 1914), 727-28.